సిగ్గు

సతీష్‌చందర్

ఆ కలికి అమ్మంటే భయం. అమ్మ ఇంకా ఆమడదూరంలో ఉండగానే ఆకలి పారిపోయింది. కొబ్బరి ఆకుల సందుల్లో నుంచి తన తల్లిరాకను పోల్చుకున్నాడు అబ్బులు. మిట్టమధ్యాహ్నం అందరికీ నడినెత్తిన సూర్యుడున్నాడు. అమ్మ నెత్తిన మాత్రం అన్నం ఉంది.

అప్పుడు వీస్తున్న గాలి చల్లగా అనిపించింది. తెలిగ్గా ఉన్న జుట్టును తడిమిపోయింది. పొలం వైపు చూశాడు అబ్బులు. చిన్నచిన్న చెరకుముక్కల మధ్య తనవాళ్లు అందరూ ఆడవాళ్లే. కొప్పులూ, చేతులూ కదులుతున్నాయి.

కలుపు తీస్తున్నారు కానీ, కబుర్లు నాటుతున్నారు. మందారాలున్న కొప్పులైతే మాటిమాటికీ ఎగసిపడుతున్నాయి. జాకెట్లు కప్పనంత మేరా వీపులు ఎండకు మెరుస్తున్నాయి. కష్టజీవులకు కడుపు మాడితే తెలుస్తుంది. వీపు మాడితే తెలీదు.

అబ్బులు చిన్న మట్టిబెడ్డ తీసుకొని ఒక వీపు మీద కొట్టాడు. ఒక మందారం వెనక్కి తిరిగింది.

“ఏయ్ బాయ్యా! నీ యేసాలు నాకెరుకేగాని యేం కావాలో సెప్పు వణ్ణమా? ఇప్పుడు కాలిందన్న మాట కడుపు,” ఆ మందారం ఎవరో కాదు. అబ్బులి మరదలే. పేరు సరస్వతి కానీ ఆరో తరగతి దగ్గరే బడి మానేసింది. అయినా చదువంటే పిచ్చి. కాగితం ముక్క కనిపిస్తే చాలు అందులోని అక్షరాలు గుణించుకుని, గుణించుకుని చదువుతుంది. ఊహ తెలిసినప్పటి నుండీ అబ్బులు వాళ్ల ఇంట్లోనే పెరుగుతోంది.

మరదలని వరస కలుపుకున్నారుగానీ, సరస్వతి బాగా దూరపు బంధువుల పిల్ల. పెంచే తాహతు లేక తల్లిదండ్రులు చిన్నప్పుడే వదులుకున్నారు. అబ్బులు తండ్రి బతికున్నంత వరకూ సరస్వతి స్కూలుకు వెళ్లింది. అబ్బులు తండ్రి పంచాయితీ బోర్డు మెంబరుగా చేసేవాడు. మాలపల్లి మొత్తానికి ఆయనే నాయకుడు. కామెర్లొచ్చి చనిపోయాడు. అప్పటి నుంచీ అబ్బులు తల్లి వెంకమ్మే కుటుంబాన్ని చక్కబెట్టుకోవాల్సి వచ్చింది. అర ఎకరం పొలమూ, రెండు పాడిగేదెలూ ఆమె ప్రాణానికి పెద్ద బాధ్యతలే. వాటిని సరస్వతే పంచుకోవాల్సి వచ్చింది.

సరస్వతికి ఆ ఇంట్లో స్థానం ఎప్పుడో నిర్ణయం అయిపోయింది. ఆ విషయం ఊరందరికీ తెలుసు. అందుకే కాబోలు, సరస్వతి అంటే కొందరికే తెలుసు. ‘అబ్బులుగాడి పెళ్లాం’ అంటే అందరికీ తెలుస్తుంది. పెళ్లి తంతు ఒక్కటే జరగాల్సి ఉంది. తల్లి వస్తున్న వైపు వేలుపెట్టి చూపించాడు అబ్బులు.

“ఒరి నీ సోకులు సంతకెల్లా కూడు తినమంటే టెక్కు సేసింది ఇందుకా? అయినా నిన్ననేం లాబం? దాన్ననాలి కానీ... రానీయ్ సెపుతాను.”

చేతిలోని కొడవల్ని లేచిన చోటనే వదిలేసి కచ్చా పోసిన (గోచీలా వెనక్కి దోపిన) చీర అంచుల్ని విడుదల చేసింది. మనిషి నలుపే. కాకుంటే నున్నటి నలుపు. దానికితోడు పట్టీపట్టని చెమట. ఆపై వెండివాన లాంటి సూర్యకాంతి. ఒళ్లంతా నిగారింపే. కపటంలేని నిగారింపు. కానీ ఖర్చు లేకుండా వచ్చింది. వంద చీకట్లూ, వెయ్యి పరదాలూ కలిసి కుట్ర పన్నినా దాచలేనిది యౌవనం. అలాంటి యౌవనానికి ఎండ ఎంతటి అద్భుతమైన స్వేచ్ఛ.

''ఏరా బాబా... ఏంటీ? ఈ కర్రిది లేసి పడుతుంది?'' మనసారా తిట్టుకుంటూ నెత్తి మీద తట్ట దించుకుంది వెంకమ్మ. తిట్టులోని ప్రేమకన్నా తీయనైన అభివ్యక్తి వేరొకటి ఉండదేమో?

''అదిసరే కానీ ఎంకిదానా నీ కొడుక్కెప్పుడు గేణవొత్తాదే?'' చీర కుచ్చిల్లు సాపు చేసుకుని అబ్బులు పక్కనే చతికిలపడుతూ అడిగింది సరస్వతి.

''నిన్నొదిలేసి ఇంకోదాన్ని తగులుకున్నప్పుడు,'' నాలుగు అరల ఇత్తడి కేరియర్‌కి స్క్రూ తీస్తూ అంది.

''లమ్మా! ఏం సెప్పావే సెకండియ్యా!'' అబ్బులు తన తల్లి కుడిచెయ్యి తీసుకుని ఆనందం నటిస్తూ ఊపేశాడు. అబ్బులు బి.కాం.లో ఒక సబ్జెక్టు మిగిలిపోతే చదువుతున్నాడు. మరో రెండువారాల్లోనే పరీక్షలు. దగ్గరుండి కలుపు తీయించినట్లూ ఉంటుంది, చదువుకున్నట్లూ ఉంటుంది అని రెండు రోజుల నుంచి పొలం గట్టు మీదే మకాం పెట్టాడు.

తల్లీకొడుకుల ఎకసెక్కాలకి నిరసనగా మూతి వంకర్లు తిప్పుకుంటూ రెండు చేతుల్తో ఒక పుస్తకాన్ని తీసి ఒళ్లో పెట్టుకుంది సరస్వతి. కేరియర్‌లోని గిన్నెల్ని ఒబ్బిడిగా పరిచింది వెంకమ్మ. అడుగు గిన్నెలో అణచి పెట్టిన అన్నం, రెండో గిన్నెలో ఎర్రని ఉప్పు చేపల వేపుడూ, మూడో గిన్నెలో వేయించిన కరివే పాకులూ, పండు మిరప కాయలు తేలే పప్పుచారూ, పై గిన్నెలో మీగడ పెరుగూ అబ్బులి ఆకలి విలువను రెట్టింపు చేశాయి.

''కర్రిదానా రా. నీ కేరేజి కూడా తియ్యే,'' చెంబులో నీళ్లు స్టీలు గ్లాసులో వేస్తూ అంది వెంకమ్మ. మూతి మరోసారి వంకర్లు తిప్పుకుంది సరస్వతి.

''సద్దికూడు తిన్న ఆడది మొగుడాకలెరగదని ఊరికే అన్నారా? పూటుగా లాగించేసి పుత్తకాలు తిరగేత్తన్నావన్నమాట. గొప్ప సదవరిలెండి,'' మరింత రెట్టించింది వెంకమ్మ. అయితే వెంకమ్మ వెటకారం సరస్వతికి రుచించలేదు. పైపెచ్చు మనసులో కలుక్కుమంది. కష్టం కలిగింది. చాకిరీ కష్టం కాదు. చాకిరీని గుర్తించకపోతే కష్టమనిపిస్తుంది. ఆ కష్టాన్నే ప్రకటించకుండా ఉండలేకపోయింది.

''సాలు సాల్లేవమ్మా. ముందు తిన్న ఆడదానికి సారుకూడు, యెనక తిన్న మొగోడికి సేపలేపుడు. సాకిరీకి నేనూ, సదువుకీ నీ కొడుకూ,'' ఈ మాటలంటున్నప్పుడు సరస్వతి కళ్లల్లో నీటిచారికలు మెరిశాయి. వెంకమ్మ వెంటనే గ్రహించి, సరస్వతి తల మీద చెయ్యి వేసి చనువుగా దగ్గరికి లాక్కుంది.

''ఛా! నోర్ముయ్ గొప్ప సదువుల్లే! ఈడు ఎంత సదుంకున్నా నీ కొంగట్టుకుని తిరగాల్సిందేగందా! అదుగో మేట్టారమ్మాయి గేసమ్మ సూడు, సివరాకరికి యేమయ్యిందో? బియ్యే సదుంకుందా... సదుంకున్నోణ్ణే సేసుకుందా... కడకాడేం సేసాడూ? ఇంకోదాన్ని తగులుకుని దీన్ని తరిమేశాడు. పొద్దుటేలే బస్సు దిగింది. ఒకటే సోకండాలు...''

వెంకమ్మ అలా చెపుతుండగానే మధ్యలో అబ్బులికి పలకమారింది. సరస్వతి అబ్బులు నెత్తి మీద చిన్నగా మొత్తి, గ్లాసులోని నీళ్లు పట్టించింది. అబ్బులు తేరుకున్నాడు. సరస్వతికి కోపం ఎగిరిపోయింది.

''అమ్మా! గ్రేస్ నిజంగానే వచ్చేసిందా?'' తన అనుమానాన్ని నివృత్తి చేసుకుని, అయిదు నిమిషాల్లో భోజనాన్ని పూర్తిచేసి, పేట వైపు ప్రయాణమయ్యాడు అబ్బులు.

''లప్పాయ్! నీ కొడుక్కి గేసంటే పిచ్చిపోలేదే!'' అబ్బులు వెళ్తున్నవైపు చూస్తూ అంది సరస్వతి.

''పిచ్చి కాదే జాలి! పొద్దున ఆ పిల్ల వోలకం సూత్తే నాకే యేడుపొగలేదు,'' అభియోగాన్ని ఒక్క ముక్కతో కొట్టి పారేసింది వెంకమ్మ.

గ్రేస్! ఆ పేరంటే అబ్బులికి ఒక తుళ్లింత. ఆమె అరచేతి స్పర్శ అతడికి తెలుసు. ఆదమరచి నిదురిస్తున్నప్పుడు మీదపడ్డ మొదటి చినుకులా ఉంటుంది ఆ స్పర్శ. ఆమె ముక్కుపుటాల్లోంచి వచ్చే వెచ్చటి శ్వాస అతడికి తెలుసు. వేడివేడి అన్నం మూకుడు మీద మూత తీసినట్టుంటుంది ఆ శ్వాస.

మరి ఆమె రంగు? తెలుపు కాదు, నలుపు కాదు. మధ్యస్థం. చామనఛాయ అని ఒక్కముక్కలో చెప్పడం వీలుకాదు. తెలుపు, నలుపులు శరీరపు కాంతిని మాత్రమే చెబుతాయి. శరీరాన్ని నిర్వచించలేవు. వొయ్యారాన్ని ప్రకటించలేవు. కానీ చామనఛాయ అలా కాదు. అదొక చురుకైన రంగు. చూడగానే చురుక్కుమనే రంగు. వేడివేడి చెరుకు పానకంలో వేలుపెట్టి చటుక్కున తీసి నోట్లో పెట్టుకుంటే ఎలా ఉంటుందీ? ఆమె ఒంటి రంగును చూసినప్పుడల్లా అబ్బులికీ అలా ఉంటుంది. నిజానికి గ్రేస్ రంగు ఒక్క చామనఛాయ కాదు. రెండు చామనఛాయలు! రుతువును బట్టి ఆమె ఒంటి రంగు మారేది. గ్రేస్‌కు సంబంధించినంతవరకు రెండే రెండు రుతువులు. ఒకటి- చదువుల రుతువు. రెండు- సెలవుల రుతువు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే చీరలు కట్టే రుతువొకటి, చీరలు కొనుక్కునే రుతు

వొకటి. కాలేజీకి సెలవులిస్తే చాలు, కచ్చా బిగించి, కొడవలి చేతపట్టి, పొలం పనుల్లోకి దూకేది. సరదాకి కాదు. కూలికే.

వాళ్ల అమ్మానాన్నా టీచర్లే. అయినా అదేం ఖర్మ. రకరకాల చీరలు కట్టాలి. కాస్త చిన్నప్పుడైతే పరికిణీలు కట్టాలి. అమ్మానాన్నల్ని నమ్ముకుంటే ఏడాదికి రెండే చీరలు. ఒకటి ఈస్టర్‌కీ, మరొకటి క్రిస్మస్‌కీ. మరి గట్టిగా పేచీ పెడితే, "చాలుచాల్లే మా జీవిమంతా నీ చీరల మీదే తగలేస్తే, రేపు నీకు పెళ్లెవరు చేస్తారే?" అంటారు. అందుకే గ్రేస్ కూలీకెళ్తుంది.

ఒక్క గ్రేసే కాదు, దాదాపు అక్కడి మాలమాదిగ పల్లెల్లోని కాలేజి చదివే ప్రతి అమ్మాయి, అబ్బాయి ఇదే పని చేస్తారు.

'అందరూ చేస్తే చేశారు. గ్రేస్ ఎందుకు చెయ్యాలి?' అన్నది విలవిల్లాడే అబ్బులి ప్రాణానికి సంబంధించిన ప్రశ్న. గ్రేస్ కూలీకి వెళ్తున్నప్పుడు రోజు రోజుకీ వన్నె తగ్గుతుండేది. చామనఛాయ చిక్కపడు తుండేది. రెండు వారాల సెలవులైతే దాదాపు నలుపుకి దగ్గరయ్యేది.

కూలి కొత్త వర్ణాన్నిస్తుందన్నమాట. కాలేజీ తెరిచి నప్పుడల్లా కొత్తకొత్త చీరల్లో గ్రేస్ ప్రత్యక్షమయ్యేది. కానీ తన చీరకు రంగునివ్వడం కోసం, తన వన్నెను కోల్పో యేది. బస్టాండులో నిలబడ్డప్పుడు చీర మాత్రమే కని పించేది. తాను కాదు. పాలకొల్లు వెళ్లే బస్సు రాగానే డోర్ దగ్గరకు పరుగెత్తేది. వెనువెంటనే అబ్బులు. పై మెట్టు మీద ఆమె, క్రింద మెట్టు మీద అబ్బులు. ఆమె వీపు మీద అతడి శ్వాస. చిన్నగా నవ్వేది. ఇది రోజూ జరిగే సన్నివేశమే. ఒకరోజు మాత్రం ఈ సన్నివేశమే అబ్బుల్ని కలవరపరిచింది. కారణం ఆమె వీపు పెరిగింది. ఇందు లో ఎవరి నేరమూలేదు. మారిన హీరోయిన్ జాకెట్ల ననుసరించి టైలర్ ఒక ప్రయోగం చేశాడు. జాకెట్ మెడ కాస్త ఎక్కువగా కత్తిరించాడు. వీపు ఇంకాస్త ఎక్కువగా కనపడేటట్లు కుట్టాడు. దాంతో ఎండబారిన పడని వీపు భాగం కూడా ఒక చారికలా కనిపించింది. ఆమె కాయ కష్టానికి అదో సరిహద్దు రేఖ.

ఆమె వీపు పై భాగాన అబ్బులు భారంగా వది లాడు శ్వాస. ఎప్పటిలాగే గ్రేస్ వెనక్కి తిరిగింది కానీ నవ్వలేకపోయింది. అతడి శ్వాసలోని రవంత వేదన యేదో ఆమెను తాకినట్లుంది.

ఆరోజు ప్రయాణమంతటా ఆమె వీపు మీద సరి హద్దు రేఖనే చూశాడు. పాలకొల్లులో బస్సు ఆగింది. ఇద్దరూ దిగారు. అబ్బులు దిగులు ముఖం గ్రేస్‌కు నచ్చ లేదు. "ఏయ్ అబ్బులూ! కాఫీ ఇప్పిస్తావా?" నవ్వుతూ అడిగింది.

"ఇంటి దగ్గర తాగలేదా?" అనాలోచితంగా అనే శాడు అబ్బులు. అసలు గ్రేస్ కాఫీ మాట ఎత్తితే చాలు ఎగిరి గెంతేసేవాడు. ఎందుకంటే రెస్టారెంట్‌లో ఆమె ఎదురుగ్గా కూర్చొని ముచ్చట్లాడవచ్చు. కానీ ఈసారి మనసులోని దిగులు, అలా మాటల్ని తారుమారు చేసింది.

"అమ్మ తిట్టింది. ఏమీ తినకుండా వచ్చేశాను," అబ్బులి ముఖంలోకి తొంగిచూస్తూ పసిపిల్లలా చెప్పింది.

"ఎందుకు?"

"డబ్బులన్నీ చీరలకు తగిలేశానని," బదులిస్తూ నవ్వేసింది. అది దుఃఖాన్ని దాచిన నవ్వు. అందుకే కాలే పెనం మీద నీటిబొట్టులా అది క్షణంలోనే ఆవిర య్యింది. కష్టార్జితాన్ని గుర్తించనందుకు ఆ క్షణంలో కన్నతల్లి కూడా కామందులాగే కనిపించింది. దుఃఖం ఉబికి వచ్చింది. తల పక్కకు తిప్పుకుంది.

"ఏయ్ గ్రేసూ... గ్రేసూ...? నిన్నే ఇటు చూడు... అరె... నిన్నే," ఆమె గడ్డం పట్టుకుని తనవైపునకు తిప్పు కున్నాడు. మూసిన కళ్లు! మళ్లీ నవ్వే ప్రయత్నం చేస్తూ కళ్లు తెరిచింది. రెండు కన్నీటిబొట్లు రాలాయి, కొబ్బరి ఆకు మీద వానబొట్లు గాలికి రాలినట్లు. గబగబా కొత్త చీర కొంగుతో ఆనవాళ్లు లేకుండా కన్నీళ్లను తుడి చేసుకుని, "కాఫీ వద్దులే కాలేజీకెళ్లిపోదాం," అంది.

"కాలేజికెళ్లిపోతావా...? కొట్టాననంటే... మళ్లీ!" అభిమానాన్నీ, చనువునీ మిళితం చేసి చెయ్యెత్తాడు అబ్బులు. అటూఇటూ చూసుకుంది గ్రేస్. ఎత్తిన అతడి కుడిచేతిని, తన ఎడమచేతిలోకి తీసుకుని కిందకు దించింది. అంతటితో ఆగలేదు. బలంగా నొక్కడం మొదలుపెట్టింది.

"ఇప్పుడు చెప్పు... కొడతావా? నిండా నీళ్లబాల్చీ ఎత్తలేనోడివి నన్ను కొడతావా?"

"ప్లీజ్! గ్రేసూ? ప్లీజ్... వదులు... ఏయ్ నిన్నే... ఎవరైనా చూస్తే బాగుండదు... వదులూ..." ఆమె చెయ్యి గట్టిగా ఉంది. అయితేనేం? వెచ్చగా ఉంది. అలా చెయ్యి వదలకుండానే బస్టాండ్ నుంచి రెస్టారెంట్ వైపు దారి తీసింది గ్రేస్. ఆమె నిర్ణయానికి ఆనంద పడ్డాడు. కానీ, అరచేతిలోని నొప్పిని తాళలేకున్నాడు. ఈలోగా ఆర్టీసీ బస్సొకటి వాళ్లపక్క నుంచి దూసు

కెళ్లింది. "ఛీ... ఛీఛీ... ఛీఛీ... చీరనిండా మురికినీళ్లు," అన్నాడు అబ్బులు. ఉలిక్కిపడి అబ్బులు చెయ్యి వది లేసింది. చీర కుచ్చిళ్లు పట్టుకుని ముందూ వెనకా చూసుకుంది. అలాంటి ప్రమాదమేమీ జరగలేదు. "హమ్మయ్య! గుండె జారిపోయిందనుకున్నాను. మూడొందల రూపాయల చీర!"

బిక్కచచ్చిపోయింది. పసిపిల్లలా వణికిపో యింది.

'ఎహ్వెహ్వెహ్వె..." అని వెక్కిరించబోయిన అబ్బులికి, మూడొందలంటే పదిహేనురోజుల కూలి అన్న లెక్క గుర్తుకొచ్చి, ఆమె చేతిని మృదువుగా తన చేతిలోకి తీసుకుని రెస్టారెంట్లోకి అడుగుపెట్టాడు.

అప్పటికదే ఆఖరి స్పర్శ. ఆ తర్వాత గ్రేస్ గురించి వినడమే తప్ప చూడలేదు. ఆ రాత్రి ఇంటికి వెళ్లాక, గ్రేస్‌కు తల్లితో చీరల గొడవ మళ్లీ రాజుకుంది. ప్రేమ వచ్చినా, కోపం వచ్చినా పొడిపొడి మాటల్తో తీర్చుకో వడం తల్లీకూతుళ్లిద్దరికీ తెలీదు. కలబడ్డారు. కొట్టు కున్నారు.

తెల్లవారుఝామున తన చీరలు, సర్టిఫికెట్లు పట్టుకుని బస్సు ఎక్కి ఏడుస్తూ వెళ్లిపోయింది. వారిం చిన వాళ్లందర్నీ బండబూతులు తిట్టిందని పేటలో వాళ్లు ఇప్పటికీ చెబుతుంటారు.

అంతే, ఆ తర్వాత ఎప్పుడో, ఆమె భీమవరంలో వాళ్ల మేనత్త ఇంటికి వెళ్లిందని తెలిసింది. కోపం తగ్గాక తిరిగొస్తుంది కదా అని ఇంట్లోవాళ్లు ఎదురుచూశారు. అబ్బులు కూడా అలాగే అనుకున్నాడు కానీ ఇంతలోనే పిడుగులాంటి వార్త వచ్చింది. ఎవరో రాజుల కుర్రాడితో లేచిపోయిందని వాళ్ల మేనత్త కబురు మోసుకొచ్చింది.

ఆ విషయం తెలిసిన రోజు, తన గదిలో దూరి తలుపేసుకుని అబ్బులు రెండు గంటలసేపు వెక్కివెక్కి ఏడ్చాడు. కన్నీరు కార్చిన కళ్లను తుడుచుకున్నా గుర్తు పట్టవచ్చు.

"ఏయ్ బాయ్యా మందుకొడతావా?" ఏడ్చి బయటకొచ్చిన అబ్బుల్ని సరస్వతి అడిగిన ప్రశ్న అది.

"ఛీ... అలా అడుగుతున్నావేంటీ?" మరొకసారి కళ్లు నులుముకుంటూ అడిగాడు.

"పేమించినపిల్ల ఎగిరిపోతే సినిమాలో నాగార్జున ఏం సేత్తాడు? మందుకొట్టడా?" అని తుర్రుమని పారి పోయింది.

అబ్బులు నవ్వేశాడు. నిజమైన జీవితంలో నవ్వుకీ ఏడుపుకీ మధ్య సరిహద్దు రేఖ ఉండదు. గ్రేస్ గుర్తొచ్చి నప్పుడల్లా అబ్బులికి కాస్త దిగులూ, కొంచెం గుబులూ కలుగుతుంది. ఆమె మాట, ఆమె స్పర్శ, ఆమె శ్వాస...! అన్నీ కోల్పోయానని అనుకుంటే దిగులు, కొన్నాళ్లయినా పొందగలిగాననుకుంటే గుబులు.

*

'ఆమెను చూసి రెండేళ్లయింది. ఇప్పుడెలా ఉంటుందో?' అని అనుకునేలోగానే నిలువెత్తు అంబే ద్కర్ విగ్రహం దగ్గరికి వచ్చేశాడు అబ్బులు. వేలెత్తి చూపించే ఆ విగ్రహం పక్కనే గ్రేస్ ఇల్లు.

అరుగు మీదే ఒకపక్కగా కూర్చుని బియ్యంలో రాళ్లు ఏరుతోంది గ్రేస్ అమ్మమ్మ. మరోపక్క మడత మంచం మీద వెల్లకిలా పడుకుని ఉన్నాడు గ్రేస్ తమ్ముడు లివింగ్‌స్టన్. కొబ్బరిచెట్టు మీద నుంచి పడి కాలు బెణకడం వల్ల పదిరోజుల్నించి మంచం మీదనే ఉన్నాడు.

"మామ్మా గ్రేస్ వచ్చేసిందా?" అబ్బులు అడిగాడో లేదో ముసలావిడ జాకెట్‌లేని భుజాన్ని తెల్లచీర కొంగు తో కప్పుకుంది. ఒక్కసారి గుమ్మంలోంచి ఇంట్లోకి తొంగి చూసి, మాటల్ని గుసగుసల్లోకి దించేసింది. "అబ్బులా! దీని బులుపు వొదిలిపోయింది. నీకు తెల్దా? ఆ రాసోడు దీన్ని తరిమేశాడు బాబా. ఇలా అగపడద్ది కాని, దీనికెంత పొగరో తెలుసా? నా కూతురు ఎర్రిబాగుల్ది. దీని శోకం డాలు సూసి కరిగిపోయింది. అనకూడదు కాని బుల్లోడా, ఇది సెంకిణీముండ... సీరముక్క కోసం నా కూతుర్నట్టుకు కొడతాదా ఈ ఆడదీ...?" ఇంకా ముస లావిడ నిష్ఠూరాలకి తెరపడకుండానే మంచంమీది లివింగ్‌స్టన్ మధ్యలో ఆతృతగా కలుగజేసుకున్నాడు.

"ఎవరూ? అబ్బులా? ఓరి... నీకోసమే కబురెడదా మనుకుంటున్నాన్రా... ఎంతవుద్దో కనుక్కున్నావా? వుత్తి బట్టకే మూడేలవుద్దంటకదా. కుట్టుకూలి అయిదొం దల్లో అయిపోద్దంటావా?" దొరికాడు కదా అని పీకట్టు కున్నంత పనిచేశాడు లివింగ్‌స్టన్. లివింగ్‌స్టన్‌కి పెళ్లి కోటు పిచ్చి. అతనెప్పుడూ ఒకే ఒక ఊహలో ఉంటాడు. చర్చిలో తనకు పెళ్లి జరుగుతున్నట్టు. అలాగని ఏ అందమైన పెళ్లికూతురో తన పక్కనున్నట్టు కల కనడం, ఊహించుకోవడం. అసలు వధువు ఎవరన్నది అతనికి అప్రస్తుతం. అతని ఊహలన్నీ పెళ్లిరోజు తాను చేసుకో బోయే సూటు మీదే.

ఎక్కడన్నా పెళ్లి జరుగుతుంటే పిలవకపోయినా హాజరవుతాడు. ఇంకెందుకూ...? పెళ్లికొడుకు సూటు చూడ్డం కోసమే. గోరింటాడలో ఆరోజు కూడా పెళ్లి

ఉంది. పైగా దగ్గర బంధువుల ఇంట్లో పెళ్లి. ఆహ్వానం కూడా వచ్చింది. ఇంటిల్లిపాదీ వెళ్లినా తాను, గ్రేసూ, ముసలావిడా ఉండిపోయారు. కారణం కాలు. ఆ రోజంతా పెళ్లికి వెళ్లలేకపోయానన్న దిగులుతోనే ఉండి పోయాడు లివింగ్‌స్టన్.

అసలు కాలు బెణకడానికి కారణం కూడా పెళ్లి కోటే. కొబ్బరికాయల డబ్బు, కోటు కుట్టుకూలికి పని కొస్తుందని, ఎవరూ లేకుండా చూసి వాళ్ల ఇంటి చుట్టూరా ఉన్న కొబ్బరి చెట్లెక్కడం మొదలుపెడితే మధ్యలో జారిపడ్డాడు.

అబ్బులు ఇద్దరి మాటల్నీ పెడచెవిని పెట్టి, లోపలికెళ్లాడు. నవారు మంచం మీద గోడవైపుకు తిరిగి పడుకుని ఉంది గ్రేస్. కాస్త వొళ్లు చేసినట్లుంది. చిల కాకుపచ్చ చీర, అదేరంగు జాకెట్టు వేసుకుంది. చీర కప్పని నడుం భాగం చూశాడు. అది గ్రేస్ రంగు కాదు. చామనిఛాయ కాదు. కూలికి వెళ్లి మాడిన నల్లరంగూ కాదు. ఇదొక కొత్త వర్ణం. తెల్ల వర్ణం. నడుముమీద వేసు కున్న చెయ్యి చూశాడు. అదే వర్ణం. ఆమెది కాని వర్ణం.

చనువుగా చేతిమీద కొట్టి లేపుదామన్న ప్రయ త్నాన్ని విరమించుకున్నాడు. "ఏయ్ గ్రేసూ," అంటూ వెళ్లి మంచం పక్కనే కూర్చున్నాడు. ఆమె గిరుక్కున వెనక్కి తిరిగింది. కనుగుడ్ల నిండా నీళ్లు.

గ్రేస్ వర్చస్సే మారిపోయింది. బుగ్గలొచ్చాయి. చిక్కటి కనుబొమల స్థానంలో సన్నటి గీత లొచ్చాయి. ముక్కు నునుపు తేలింది. ఒకప్పుడు పెదవుల మీద ఉండే నల్లటి నీడ మచ్చుకి కూడా కానరావడం లేదు. మెడలో పూసల దండపోయి తెల్లటి ముత్యాలొచ్చాయి.

అబ్బులు నిశ్చేష్టుడై చూస్తుండగానే ఆమె అతని చేతిని అరచేతుల్లోకి తీసుకుని మెడ దగ్గర పెట్టుకుంది. కుమిలికుమిలి ఏడ్వడం మొదలుపెట్టింది. ఆమె అర చేతులు దృఢంగా లేవు. మెత్తగా వున్నాయి. వెచ్చగా లేవు. చల్లగా ఉన్నాయి.

గ్రేస్ స్పర్శ అతణ్ణి నిరుత్సాహపరిచింది. గ్రేస్ సుకుమారమైన ముఖం అతణ్ణి నిస్తేజుణ్ణి చేసింది. అక్కణ్ణించి తక్షణం వెళ్లిపోదామనుకున్నాడు. ఈలోగా ఆమె వెచ్చని కన్నీటి బొట్టొకటి అతని ముంజేతి మీద పడింది. ప్రాణం లేచి వచ్చింది. ఆమె కళ్లనీ, బుగ్గల్నీ తుడిచాడు. అలా చెరిగిన కంటి కాటుక బుగ్గల్ని అక్క డక్కడా నలుపు చేసింది. ఆ నలుపులో గ్రేస్‌కు పాత పోలికలొచ్చాయి. లేని జవసత్వాలు వచ్చాయి. హఠాత్తు గా గ్రేస్ లేచి కూర్చుంది. అతడి చేతుల్ని తన మెడ చుట్టూ వేయించుకుని గాఢంగా కౌగలించుకుంది. బావురుమంది. తనివితీరా ఏడ్చుకుంది. జడివాన తర్వాత ఆకాశం తేరుకున్నట్టు ఆమె తేరుకుంది.

"అబ్బులూ! నన్నెక్కడికన్నా తీసుకెళ్లవా?" చెవి దగ్గరగా అడిగింది. ఏడ్చిఏడ్చి బొంగురుపోయిన గొంతుతో.

"పాలకొల్లు సినిమాకెళ్దామా? ఇప్పుడు బస్సుం డదే! సైకిల్ మీద వెళ్దామా," అలా అన్నాడో లేదో, అతడి చెవి పట్టుకుని బలంగా కొరికింది. "అమ్మా!" అబ్బులు పెద్ద కేక పెట్టి ఆమెను విదిలించుకున్నాడు.

"అయ్యో! అయ్యో! ఏమయిందే ముదనష్టపు దానా?" బయటి నుంచి అరిచింది ముసలమ్మ.

అబ్బులు తత్తరపడి, మళ్లీ తేరుకున్నాడు. "ఏం లేదు మామ్మా! మొగుణ్ణొదిలేసి రావడం మంచిదేనా?" అన్నాను. నీళ్లచెంబుచ్చుకు కొట్టింది. తగల్లేదులే," అన వసరపు సంజాయిషీలన్నీ ఇచ్చేశాడు.

"నిన్ను కూడా కొట్టిందా మాయదారి ముండ. మోసుకుంటాదిలే," తన బియ్యం తాను చెరుగుకుంది ముసలావిడ.

"ఏయ్! అలా చెవి పట్టుకు కరిచావేంటీ?" చేత్తో తన చెవిని తడుముకుంటూ అడిగాడు.

"మరి కరవక ముద్దెట్టుకుంటానా? ఏదో ఏడు పొచ్చి మీదపడ్డాను కదాని, పరాయి ఆడదానినని చూడ కుండా సైకిలెక్కించుకుని ఊరేగుతావా?"

ముఖం కొంచెం ముడుచుకుని గోడకు చేర బడింది గ్రేస్.

"ఛీ... సైకిలంటే ఒక సైకిల్ కాదు. రెండు సైకిళ్లు," అబ్బులి ముఖంలోకి చిరుకోపం పొడుచుకు వచ్చింది. గ్రేస్ పగలబడి నవ్వింది. ఆ నవ్వుతో, కొత్త గ్రేస్ పూర్తిగా పాతబడింది.

*

సాయంత్రం ఎండలో సైకిళ్ల ప్రయాణం. ఇద్దరికీ చెరో గూబా గుయ్యిమంటోంది. బస్సు మిస్సయినప్పు డల్లా ఇలా కాలేజీకి కలిసి సైకిళ్ల మీద వెళ్లడం ఇద్దరికీ అలవాటే. కానీ, గ్రేస్ సైకిల్ ఎక్కి చాలాకాలం అయ్యింది కదా, కాస్త ఆయాసపడుతోంది. దానికితోడు మెల్లమెల్లగా ఆమె భర్త వివరాలు రాబడుతున్నాడు అబ్బులు.

తీరని ఆవేశం, ఆయాసాన్ని పెంచుతుంది కదా! అదే జరిగిందక్కడ. "గ్రేసూ, నిజం చెప్పు, మీ ఆయన కొట్టాడా?" సైకిల్‌ని కాస్త 'స్లో' చేసి ఆమెకు పక్కగా వెళ్లనిస్తూ అన్నాడు.

"కొడతాడా? చేతులు ఇరిచెయ్యనూ?" కిలో మీటరు దూరంలో ఎక్కడో ఎదురువస్తున్న మనిషిని చూసి, 'బెల్లు' మోగిస్తూ అంది.

"ఆగమ్మా గంటలరాణీ! ఆడింకా ఎదురు రావడానికి టైముందిలే. అది సరే, మీ ఆయన చేసే వ్యాపారమేంటీ?"

"రాజాస్ క్లాత్ స్టోర్స్, మెయిన్‌రోడ్, భీమవరం!"

"అందులో సేల్స్‌మేన్‌గా పనిచేస్తాడా?"

"కాదు. గేటు దగ్గర నిలబడతాడు."

"ఓహో! సెక్యూరిటీ గార్డా?"

"మొహం చూడు ఎలాగుందో. ఈడు ఆ షాపుకి వోనరు. అర్థమయిందా? అందుకే ఆడికంత కొవ్వు."

"ఇంకేం? పూటకో చీర కట్టొచ్చన్న మాట."

అబ్బులన్న ఈ మాట గ్రేస్ చెంప మీద ఛెళ్లుమని కొట్టినట్లనిపించింది.

మౌనం. ఆమె రోడ్డుని కాక శూన్యాన్ని చూస్తూ సైకిల్ తొక్కుతోంది. కిలోమీటరు దూరం నుంచే కనిపిస్తున్న వ్యక్తి ముందు చక్రం దగ్గరికి వచ్చేవరకూ చూసుకోలేదు. అప్పుడు బెల్లు మోగించింది. అతడు చిందులు వేశాడు. ఆమె కంగారుపడి అబ్బులి సైకిల్‌కి చేరువగా వెళ్లింది. ఆమె సైకిల్ పెడల్ అతడి ముందు చక్రంలో ఇరుక్కుంది. ఇంకేముంది? ఇద్దరూ పడ్డారు. గాభరాగా లేచాడు అబ్బులు. ముందు ఆమెను లేవనెత్తాడు. "ఎక్కడా తగల్లేదు కదా?" అబ్బులి ప్రశ్నను ఆమె లక్ష్యపెట్టకుండా చీరంతా పరికించి చూసుకుంది. మిసమిసలాడే నిమ్మపండురంగు పాలియెస్టర్ చీర కొంగు దగ్గర కొంచెం మరక అయింది. సైకిల్‌ది కాబోలు. "ఏం కాదులే. పోతాది," భరోసా ఇచ్చాడు. ఆమె నలుదిక్కులా చూసింది. కాస్త దూరంగా పశువుల కొట్టం కనిపించింది. ఆ ప్రాంతమంతా ఆమెకు తెలిసిందే. వడివడిగా నడుచుకుంటూ అక్కడున్న బావి దగ్గరకు వెళ్లింది.

అబ్బులు రెండు సైకిళ్లనూ వేరు చెయ్యడానికి కష్టపడ్డాడు. రెండు సైకిళ్లకూ స్టాండు వేశాడు. తన సైకిల్‌కి ఊడిన చైన్‌ని తిరిగి సరిచేసుకుని గ్రేస్ వెళ్లిన వైపు వెళ్లాడు. అప్పటికే ఆమె బావిలోంచి నీళ్లు చేదుకుని, కొంగుకు పట్టిన మసిని, వంగి అదేపనిగా కడిగి పిండుతోంది. అబ్బులు రాగానే పైకి లేచింది.

"అదలా పోదులే. పెట్రోలుతో కడగాలి," అని ఆమెవైపు చూశాడు. ముఖమంతా ముచ్చెమటలు పోసి ఉన్నాయి.

"ఏయ్... ఏయ్... అబ్బులూ నా కళ్లు, కళ్లు తిరుగుతున్నాయేంటి?" అతడి భుజం మీద వాలిపోయింది. ఆమె స్పృహ కోల్పోయింది. అతడి గుండె బేజారెత్తింది. క్షణం ఆలోచించి ఆమెను రెండు చేతుల్లోకి ఎత్తుకుని పశువుల కొట్టంలోకి తీసుకెళ్లాడు. పొడిగా ఉన్నచోట, ఎండుగడ్డి మీద పడుకోబెట్టాడు. బాల్చీతో నీళ్లు తెచ్చి పక్కన పెట్టుకుని, ఆమె తలను తన వొళ్లో పెట్టుకుని ముఖమంతా కడిగాడు. కళ్లు మీద నీళ్లు కొట్టాడు. ఆమె మెల్లిగా కళ్లు తెరిచింది. అరచేతిని గుంటగా చేసి, నీళ్లను కొంచెం కొంచెంగా ఆమెకు పట్టించాడు. ఆమె తేరుకుని, అతడి చేతిని ముద్దు పెట్టుకుంది.

"అబ్బులూ, నన్ను చేసుకుంటావా?" ప్రశ్న అడిగి కళ్లార్పకుండా అతడివైపు చూసింది. "ముందు ఆస్పత్రికి వెళ్దాం నడు," తన వొళ్లో నుంచి ఆమెను తప్పించబోయాడు.

"చేసుకోవడం కుదరదులే. సరస్వతి ఉన్నాదిగా. పోనీ... పోనీ... ఉంచుకుంటావా?"

"ఛీ ఛీ! అవేం మాటలు?"

"నీకు తెలీదులే. పెళ్లి చేసుకోవడం కన్నా ఉంచుకోవడమే గొప్ప. మా ఆయన ఉన్నాడా? నా దగ్గర రెండు రోజులుంటే, దాని దగ్గర అయిదురోజులుంటాడు."

"ముందు నువ్వులే చెప్తాను," మొండిగా ఆమెను కదిలించాడు. ఈసారి ఒకే సైకిల్ మీద ఇద్దరి ప్రయాణం అనివార్యమైంది.

*

"మీ యావిడ నెల తప్పింది."

నర్సు నవ్వి పోయింది.

చీర కుచ్చిళ్లు సరిచేసుకుంటూ డాక్టర్ రూమ్‌లోంచి నీరసంగా బయటకు వచ్చింది గ్రేస్. ఆమెకు షేక్‌హ్యాండ్ ఇస్తున్నట్టు చేతిని పట్టుకు గట్టిగా ఊపాడు అబ్బులు.

"తెలిసిపోయిందా?" బయట ఉన్న బెంచీ మీద కూలబడింది గ్రేస్.

"ఏయ్ సంబరపడ్తావనుకున్నాను. ఏంటీ దిగాలుగా ఉన్నావ్?" పక్కగా కూర్చుని ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"నీకూ సంబరం. నాకెందుకూ? నా పీడ వొదిలిందిగా. నన్నేలుకోమని ఇంక పీక్కు తిననులే!" ఈ మాటకి అబ్బులి ప్రాణం చివుక్కుమంది. తల వంచుకున్నాడు కాసేపు.

"గ్రేసూ, నిజం చెప్పు! అసలు నీకూ, మీ ఆయనకూ గొడవెందుకొచ్చింది? ఇంకో మనిషిని వుంచుకున్నాడనా?"

"ఛ అదికాదు. అందుకే అయితే మూణ్ణెల్ల కిందటే వచ్చెయ్యాలి. ఆడికి నేనంటే లోకువ. నా జాతంటే లోకువ."

"ఏమన్నాడని...?"

"గోచీలెట్టుకు తిరిగేదానికి పట్టుచీరలెందు కన్నాడు. అది లేదా? అదే ఈడుంచుకున్న ముండ. అది గొప్ప జాతి బిడ్డ కదా, నేత చీరలే సింగారిస్తాదంట. దాన్లా నేనెందుకుండనూ అంటాడు. ఇదిగో అబ్బులూ, నేనోటి చెప్పనా? కలిగినమ్మ ఇప్పుకున్నా అందమే. కానీ లేనమ్మ కప్పుకుంటేనే అందం. అయినా దాన్ననుకుని ఏం లాభం? నా బతుకే అలా తగలడింది. నన్ను కన్న తల్లే నేను మంచి చీర కొనుక్కుంటే ఏడ్చింది."

"నీకేమన్నా తిక్కా! మీయమ్మ అలా ఎందుకనుకుంటుందీ?"

"తిక్కే. నా తిక్క నాకే అర్థంకాదు. నాకెందుకో ఉజ్జోగాలు చెయ్యాలనీ, ఊళ్లేలాలనీ ఉండదు. నన్నెవరూ హీనంగా చూడకూడదు. తక్కువ చేసి మాట్లాడకూడదు. నలుగుర్లోనూ తీసిపోకుండా కనబడాలి. కడుపు మాడినా సరే, శుభ్రమైన బట్ట కట్టాలి. నా తిక్క కాట్లోకెళ్లాకే పోతుంది."

"చంపుతా... ఏంటా వాగుడు," ఆమె నోరు నొక్కాడు అబ్బులు.

"బాబ్బాబు ఆ పనేదో తొందరగా చెయ్యి. నా పీడ వదుల్తుంది. చంపితే చంపావు కానీ, కాటికి పంపేటప్పుడైనా కొత్త చీరతో పంపుతావా?" పిచ్చిగా నవ్వేసింది గ్రేస్.

ఆమెవైపు ముందు కోపంగా, తర్వాత జాలిగా చూశాడు అబ్బులు. ఆలోగా నర్సు 'ప్రిస్కిప్షన్' చేతిలో పెట్టింది.

"ఇప్పుడే వస్తాను, ఇక్కడే కూర్చో..." అని గ్రేస్‌కు చెప్పి బయటకు వెళ్లాడు. అన్నట్టుగా కాకుండా, కాస్త ఆలస్యంగా తిరిగొచ్చాడు.

"సిస్టర్! ఇవేనా మందులు? ఒక్కసారి డాక్టర్‌కి చూపిస్తారా?"

నర్సుకి మందుల పాకెట్ ఇచ్చి, గ్రేస్ చేతిలో వేరే ఒక పెద్ద ప్యాకెట్ పెట్టాడు. అందుకుని అతడివైపు ప్రశ్నార్థకంగా ఒక చూపు చూసి, ప్యాకెట్ విప్పడం మొదలు పెట్టింది గ్రేస్.

"నాకు తెలుసు. చీర తెచ్చావ్ కదా?"

"మొత్తానికి చీరంటే పడి చస్తావ్!"

"అవును. దీన్ని కట్టడం కోసమైనా తొందరగా చస్తాను," అలా అంటూనే ప్యాకెట్లో వస్తువును చూసి నోరు వెళ్లబెట్టింది. అది చీర కాదు. బుల్లి గౌను. నీలాకాశం మీద చుక్కలున్నట్టుంది. గౌను మీది పాలిథిన్ కాగితాన్ని చేత్తో నిమిరింది. అబ్బులు వైపు తీక్షణంగా చూసింది. లోపల నుంచి పొర్లుకొస్తున్న ఆనందాన్ని అదిమిపెట్టడం ఆమెవల్ల కావడం లేదు.

"ఎవరికీ గౌను?" సమాధానం తెలిసి కూడా ప్రశ్నించడంలోని థ్రిల్‌ని అనుభవించిందామె.

"నీకే. తొడుక్కో. చీరల పిచ్చిపోతుంది," తెలిసిపోయే అబద్ధాన్ని తియ్యగా వదిలిపెట్టాడతను. అతడి మాటని ఆసరాగా చేసుకొని ఆనందాన్ని అంచెలంచెలుగా విడుదల చేసింది. ఆ ఆనందం ముందు నవ్వయింది. తర్వాత ఏడుపయింది. మళ్లీ నవ్వయింది.

"అవునూ, నాకు పాపే పుడుతుందని నీకెలా తెలుసు?" తేరుకున్నాక అడిగింది. అతడి దగ్గర సమాధానం లేదు.

"పోనీలే. బాబు పుట్టినా గౌనే వేస్తాను," మురుసుకుంటూ ప్యాకెట్‌ను గుండెలకు హత్తుకుంది.

"గ్రేస్, నీకో మాట చెప్పనా?" ఆమె భుజం మీద భరోసాగా చెయ్యి వేశాడు.

"చెప్పు," చాలా మామూలుగా అతడి వైపు చూసింది.

"నిన్ను పెళ్లి చేసుకుంటాను," దృఢ నిశ్చయంతో అన్నాడు.

"అదేంటి...? అది ఇందాకటి మాట. ఇప్పుడు నాకు కడుపు కదా," లోపల ఆనందం ఉన్నా ఇది జరగని ప్రతిపాదనేమోనన్న భయం ఆమెలో కనిపించింది.

"అది అడ్డుకాదు. ఒకప్పుడు నాకు నువ్వంటే ఇష్టం. ఇప్పుడు నీ తిక్క కూడా ఇష్టమయింది..." ఆమె రెండు అరచేతుల్నీ తీసుకుని తన అరచేత్తో రాస్తూ అన్నాడు. ఆమె చేతుల్లోకి వెచ్చదనం వచ్చింది.

సినిమా చూసి ఇంటికి వెళ్లాక గ్రేస్ అత్తింటి నుంచి తెచ్చుకున్న చీరలన్నీ పట్టుకుని అబ్బులు ఇంటికి వచ్చింది. "ఈ రాత్రికి మా ఆయనొస్తున్నాడు నన్ను తీసుకెళ్లడానికి. నన్ను చంపినా వెళ్లను. పుడుక్కుపోయి చీరలు పట్టుకుపోతాడు. అబ్బులా, వీటిని నీ దగ్గరే ఉంచు," గుక్క తిప్పుకోకుండా చెప్పి తుర్రుమని వెళ్లిపోయింది గ్రేస్. అబ్బులు ముచ్చటగా నవ్వు

కున్నాడు కాని, ఆ రాత్రి నిద్ర పట్టలేదు. బయట అరుగు మీద మడతమంచం వేసుకొని పడుకున్నాడు. చాలాసేపటి వరకూ కళ్లు మూతలు పడలేదు. గ్రేస్ మాటలే చెవుల్లో గింగురుమంటున్నాయి.

'కడుపు మాడినా సరే, శుభ్రమైన బట్ట కట్టాలి.' ఆ మాట ఒక పరిశోధనలా అనిపించింది. కొత్తగా సిగ్గొచ్చినట్టనిపించింది. జాకెట్ వేసుకోని గ్రేస్ అమ్మమ్మ గుర్తొచ్చింది. వస్త్రాలకు నోచుకోని మూడువేల సంవత్సరాల బానిసత్వం తరుముకొచ్చింది. పెంకిపిల్ల గ్రేస్ వీరనారిలా అనిపించింది. తృప్తిగా గుండెల మీద చేతులు వేసుకున్నాడు. నిద్ర ఎగురుకుంటూ వచ్చింది. కలలు కూడా నిద్రను వెంబడించాయి. లెక్క ప్రకారం కలలోకి ఎవరు రావాలి? గ్రేస్ రావాలి! కానీ గ్రేస్ తమ్ముడు లివింగ్‌స్టన్ వచ్చాడు.

"ఒరేయ్ అబ్బులూ, సూటుకు వెయ్యి తక్కువొచ్చాయి. నువ్వివ్వపోతే చంపేస్తాను," అబ్బుల్ని మూడుసార్లు పీకపిసికి చంపబోయాడు. మూడుసార్లూ అబ్బులు నిద్రలో మూలిగాడు. పక్కనే చాప మీద పడుకున్న తల్లి వెంకమ్మ గాభరాగా లేచింది. కొడుక్కి మంచి నీళ్లు తాగించింది. "అలా ఎల్లకిలా తొంగోకు. ఆ యెంపికి వొడ్డిగిలు," అని పడుకోబెట్టింది. అయినా ఏం ప్రయోజనం? లివింగ్‌స్టన్ విక్రమార్కుడిలా ఉన్నాడు. నాలుగోసారి కూడా కలలోకి వచ్చాడు. ఈసారి పీక పిసుకుతూ కాదు, పారిపోతూ వచ్చాడు.

'రేయి నువ్విచ్చేదేంటి. ఈ చీరలమ్మితే రావా?" అని గ్రేస్ దాచుకున్న చీరల పెట్టెను పట్టుకుని లివింగ్‌స్టన్ పారిపోతున్నాడు. లివింగ్‌స్టన్‌ని పట్టుకోవడానికి పరిగెత్తబోతే అబ్బులికి కాళ్లాడటం లేదు.

"ఆగు చంపుతా," అని అనబోతుంటే నోరు పెగలడం లేదు. లివింగ్‌స్టన్ కలలోంచి విజయవంతంగా పారిపోయాడు. అబ్బులికి నిద్ర వీడిపోయింది. తెలతెల వారుతోంది. కంగారుగా తల్లిని నిద్ర లేపాడు. "లమ్మా, ఓపాలు గ్రేస్ చీరల పెట్టె ఇలా తేయే," అన్నాడు మంచం మీద బాసంపట్టు వేసుకు కూర్చుని.

"అదేంటి? ఇందాకే కదా గేసొచ్చి అట్టుకెల్లిందీ. నువ్వేమో ఒల్లు తెలవకుండా నిద్దరోతున్నావ్. లేపటమెందుకని నానే ఊరుకున్నాను. అల్లాయనొచ్చి గేసును తీసికెల్లాడు. ఆడు దీన్నంత సితకబాదాడా? అయినా పట్టుసీర సూపిత్తే అయిసయిపోయింది. నాలుగేలంట! నిద్దరకల్లతో సూశాను," చాలా మామూలుగా చాప చుట్టేసింది వెంకమ్మ. ఆశ్చర్యపోయాడు కానీ, దిగులు పడలేదు. దీర్ఘంగా ఊపిరొదిలాడు. బ్రష్ చేసి, చల్లటి నీళ్లతో ముఖం కడుక్కుని గ్రేస్ ఇంటివైపు వెళ్లాడు. వేలెత్తి చూపించే అంబేద్కర్ విగ్రహం ముందు కాసేపు ఆగాడు. విగ్రహం కళ్లజోడు మీద పొద్దుపొడుపు వెలుతురు పడుతోంది. అంబేద్కర్ ఎందుకో ఆ వుదయం కొత్తగా కనిపిస్తున్నాడు. విగ్రహాన్ని ఆపాదమస్తకం పరిశీలించాడు అబ్బులు.

నెక్ టై, కోటు మీద కోటూ, మడత నలగని ప్యాంటూ, మెరిసే బూటూ- ఠీవిగా కనిపించాడు. లివింగ్‌స్టన్ కోరుకునే పెళ్లి దుస్తులివే.

మూడువేల ఏళ్లు ముంత వేళ్లాడిన స్థానంలో నెక్ టై. అబ్బులికి కళ్లు చెమర్చాయి. స్తంభానికి జెండా ఎగరడం కాదు, అంటరాని మనిషి ఇంటి మీద వస్త్రం రెపరెపలాడటమే తిరుగుబాటు. విగ్రహం వైపు తదేకంగా చూస్తూ, మనసులోనే సైనికవందనం చేశాడు అబ్బులు. అంతే ఠీవిగా నడుచుకుంటూ గ్రేస్ వాళ్ల ఇంటి గుమ్మంలోకి వచ్చాడు.

"అబ్బులూ, ఈ సెంకిణీ ముండ ఎల్లిపోయింది. దీనికి సిగ్గులేదు. ఆడికీ సిగ్గులేదు. పట్టుసీరట్టుకొచ్చాడు. దీని సేతిలో ఎట్టాడు. అక్కడ్తో ఆగాడేంటి? ఏకంగా దీని కాల్లట్టేసుకున్నాడు. సూట్టానికి నాకు సిగ్గేసిందనుకో," జరిగిన వృత్తాంతాన్ని మూడు ముక్కల్లో తేల్చేసింది ముసలావిడ.

"అలా అనకు మామ్మా. గ్రేస్ సిగ్గు తెలుసుకున్న పిల్ల," అబ్బులి మాటలకు ఫకాలున నవ్వింది ముసలావిడ.

"దీనికి సిగ్గా? సీరకోసం మొగుణ్ణొదిలిన ఆడదానికి సిగ్గా?" ముసలావిడ మాటల్ని ఖాతరు చెయ్యకుండా మంచం మీద ఉన్న లివింగ్‌స్టన్ వైపు చూశాడు అబ్బులు. లివింగ్‌స్టన్ మెలకువగానే వున్నాడు కానీ, నిద్రమత్తు నుంచి కోలుకున్నట్టు లేదు.

"ఒరేయ్ లివింగ్‌స్టన్, నువ్వు కోటెప్పుడు కుట్టించుకుంటావో చెప్పు. నీకు వెయ్యి రూపాయ లిస్తాను," అన్నాడు అబ్బులు. అలా అంటున్నప్పుడు అబ్బులి స్వరం దానంతటదే పెరిగింది.

"ఏంటీ! కోటే?" తక్కున లేచి నిలబడ్డాడు.

"ఓలమ్మో, ఈడు నుంచున్నాడు?" ముసలావిడ అరిచింది. కాలు బెణికిన తర్వాత లివింగ్‌స్టన్ లేచి నిలబడటం ఇదే ప్రథమం. కాలదన్నినవాణ్ణి కాళ్లమీద పడేసిందీ వస్త్రమే! లేవలేనివాణ్ణి లేచి నిల బెట్టిందీ వస్త్రమే.

మిట్ట మధ్యాహ్నమైంది. బనీను మాత్రమే వేసుకుని చెరుకు మొక్కల మధ్యకు వెళ్లాడేమో సరస్వతి వీపుతో పాటు అబ్బులు వీపు కూడా మాడుతోంది.

"బాయ్యా, గౌను నాకెప్పుడు కొంటావే?" భుజం భుజం రాసుకుంటూ అడిగింది సరస్వతి. తత్తరపడ్డాడు అబ్బులు.

"అదిరిపోకు. మీ గేసు పొద్దుటేలొచ్చి, ఎంకిదాని సెవి కొరికిందిలే. అప్పుడిన్నాను."

"నిన్నూ...!' ఉడుక్కుంటూ ఆమె నెత్తిన మొత్తబోయాడు అబ్బులు.

"ఎయ్యిరా ఎయ్యి. నాలుగెయ్యి. ఈ మద్దిన కర్రిదానికి ఒల్లు ఒంగటం లేదు," ఎప్పుడొచ్చిందో కాని, గంప నెత్తిన పెట్టుకుని వెనకాలే గట్టు మీద నిలబడింది వెంకమ్మ.

"అవునే లమ్మా, దీనికి కబుర్లు తప్ప పనిలేదు," తల్లికి ఊతమిచ్చాడు.

"హుఁ గారాల కొడుక్కి కోడేపుడు అట్టుకొచ్చింది కామోలు. ఎల్లు నాయనా ఎల్లు. ఎల్లి పీకల్దాకా మెక్కు," సరస్వతి ఉడుక్కుంది.

"సాల్లేయే సిగ్గులేనిదానా. దా, ఇలాగొచ్చీ గంప దించు," వెంకమ్మ ఆప్యాయంగా ఆదేశించింది. సణుక్కుంటూనే దింపి గంపలోకి చూసి ఆశ్చర్యపోయింది.

"ఏయ్! పుత్తకాలు," ఆకాశం చిల్లులు పడేటట్లు కేకలు పెట్టింది. గంపలో పొందిగ్గా పేర్చి వున్నాయి పుస్తకాలు. అందులో 'తెలుగు వాచకం' అనే పుస్తకాన్ని ముక్కు దగ్గర పెట్టుకుని పేజీలు జర్రున తిప్పింది. కొత్త పుస్తకాల వాసన. ఒక్కొక్క పుస్తకం గంపలోంచి తీసింది. మొత్తం పది పుస్తకాలు. పుస్తకాల అడుగున అన్నం కేరియర్.

వెంకమ్మ క్రమం తప్పలేదు. అన్నం తర్వాతనే, అక్షరాలు పేర్చింది. "ఇవన్నీ నీకే. ఇక పొలం గట్టున నువ్వు సెయ్యాల్సిన పని ఇదే," సరస్వతి కొప్పు పట్టుకుని ఆడించి మరీ చెప్పాడు. అలా చేస్తున్నప్పుడు కొప్పులోని మందారం కింద పడబోతే బంతిని పట్టుకున్నట్టు వొడుపుగా పట్టుకున్నాడు.

"హిహిహి!" అంది సరస్వతి. ముందు నవ్వుతుందనే అనుకున్నాడు అబ్బులు. ముక్కు ఎగపీల్చింది. కింత చతికిలపడింది. రెండు చేతుల్తో కళ్లు గట్టిగా మూసుకొని శోకాలు తీసింది. "ఛీ ఛీ ఛీ! ఏంటిది?" సరస్వతి ఎదురుగా చతికిలబడి, ఆమె తలను తన భుజం వైపు వాల్చుకున్నాడు. ఆమె ఏడుపు వెలిసిపోయి వెక్కిళ్లలోకి వచ్చింది.

"ఒరేయ్ బాబా! నీ పిచ్చిగాని సదవేత్తే ఉన్న మతి పోతాదిరా," పక్కనే కాస్త దూరంగా కూర్చుంటూ అంది వెంకమ్మ.

"లమ్మా! నువ్వన్నది కరెక్టేనే. ఉన్న మతి పోతుంది కానీ, లేని సిగ్గు వస్తుంది," అలా అని అబ్బులు అన్నాడో లేదో, అతడి భుజాన్ని గట్టిగా కరిచింది సరస్వతి.

"లమ్మా కరిచిందే," పెద్దగా అరిచి ముందుకు తోసి, పైకి లేచాడు అబ్బులు.

"ఏయ్, నా కొడుకుని కరిసావెందుకే కర్రిదానా," సరస్వతి పిలక పట్టుకుంది వెంకమ్మ.

"సిగ్గొచ్చీ...!"

ఆ సమాధానం చెప్పినప్పుడు తడిసిన సరస్వతి కళ్లు తళుక్కుమన్నాయి. ముఖం తుడుచుకోవడానికి ఆమె విడుదల చేసిన పైటకొంగు పైరగాలికి జెండాలా రెపరెపలాడింది.

సుప్రభాతం వీక్లీ, 14 & 26 ఏప్రిల్ 1998